సాక్షి అనకాపల్లి

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ఉత్సాహంగా ఎడ్ల పందేలు

జిల్లా స్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నర్సయ్యపేట ఎడ్లబండి విజేతగా నిలిచింది. 8లో



జపాన్‌కు టీటీ ఆటగాళ్లు

పదిరోజుల పాటు జపాన్ ఆటగాళ్ల టెక్నిక్, మెళకువల్ని నేర్చుకునేందుకు నలుగురు టేబుల్‌టెన్నిస్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. 8లో



వీధి బాలల భవితకు భరోసా!

వీధి బాలలు, అనాథలకు అండగా 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవసియ హాస్టళ్లు' ఏర్పాటు చేస్తున్నారు. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (సోమ) సహర్ (మంగళ)
6-15 4-29
నర్సీపట్నం
6-18 4-28

న్యూస్‌రీల్

సాయంత్రానికల్లా పింఛన్ ఇవ్వండి

- అధికారులకు మంత్రి అమర్‌నాథ్ ఆదేశం



ప్రసన్నకుమార్ తండ్రితో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: దివ్యాంగ బాలుడికి పింఛన్ నిలిపివేయడం పట్ల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికల్లా ఆ బాలుడికి పింఛన్ అందజేయాలంటూ అధికారులను ఆదేశించారు. మండలంలో తుమ్మపాలకు చెందిన ఎ.ప్రసన్నకుమార్ అనే దివ్యాంగ బాలుడికి గతంలో మంత్రి అమర్‌నాథ్ చొరవతో పింఛన్ మంజూరైంది. ఏడాది పాటు పింఛన్ అందజేశారు. ఈ నాలుగు నెలలుగా పింఛన్ నిలిపివేశారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. తుమ్మపాలలో జరిగిన కార్యక్రమానికి ఆదివారం హాజరైన మంత్రి అమర్‌నాథ్ దృష్టికి ఈ విషయాన్ని దివ్యాంగ బాలుడి తల్లిదండ్రులు తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ సాయంత్రం కల్లా పునరుద్ధరించాలని అక్కడే ఉన్న ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావును మంత్రి ఆదేశించారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 17వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పట్టణ సీడీపీవో పి.ప్రభావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పూడిమడక రోడ్డు-2(ఎస్టీ), నెయ్యిలవీధి (జనరల్), మండలంలో వెంకుపాలెం-1(జనరల్)అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. 2022 సంవత్సరం జులై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18సంవత్సరాలు పైబడి ఉండాలని ఆమె పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి, స్థానిక అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు పట్టణ సీడీపీవో కార్యాలయంలో ఈనెల 17వ తేదీన సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: నెల్లూరులో జరగనున్న అంతర కళాశాలల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏఎంసీ జట్టును వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు అభినందించారు. ఈ చాంపియన్‌షిప్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుంది. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, సాయ్ సెంటర్ ఇన్‌చార్జి సత్యనారాయణ, కోచ్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దౌర్జన్యం



సర్పంచ్ రాజేశ్వరి నుదుటిపై గాయం తగిలిన దృశ్యం

గొలుగొండ: కంఠారం సర్పంచ్ బిడిజాన రాజేశ్వరిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దౌర్జన్యం చేయడంతో ఆమె నుదుటిపై గాయమైంది. రెండు రోజుల కిందట ఇదే గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. ఈ బోరు మోటారును సర్పంచ్ భర్త మల్లేశ్వరరావు రిపేరు నిమిత్తం నర్సీపట్నం తీసుకువెళ్లారు. బోరుకు ఎందుకు మోటారు ఏర్పాటు చేయలేదని ఇదే గ్రామానికి చెందిన ఆర్. ప్రసన్నకుమార్, కుమార్, చిరంజీవి అనే యువకులు మద్యంమత్తులో ఆదివారం మధ్యాహ్నం సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేశారు. ఈ సమయంలో సర్పంచ్‌ను యువకులు బలంగా తోయడంతో ఆమె నేలపై పడిపోయారు. మోటారు మరమ్మతులకు ఇచ్చామని, మరమ్మతులు పూర్తయిన తరువాత ఏర్పాటు చేస్తామని చెప్పినా వారు వినలేదని సర్పంచ్ తెలిపారు. తనపై దౌర్జన్యం చేసిన యువకులపై గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె చెప్పారు.

● శ్రీఆంజనేయం



అనకాపల్లి పట్టణం ఆంజనేయుని నామస్మరణతో మార్మోగింది. ఆదివారం పట్టణంలో పెద్ద ఎత్తున హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. దీంతో పట్టణ వీధులు కిక్కిరిసి పోయాయి. 8లో

● అమ్మకు నీరాజనం



అనకాపల్లిలో నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. 8లో

వేటకు విరామం

ఎండలు తీవ్రంగా ఉండే ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్ర ఉపరితల జలాలు కూడా వేడెక్కుతాయి. దీంతో చేపలు గుడ్లు పెట్టేందుకు సముద్ర జలాల్లోపలికి వెళతాయి. అక్కడ వాతావరణం చల్లగా ఉండి, గుడ్లు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది. గుడ్లు పిల్లలుగా మారి, పెరిగేందుకు కనీసం రెండు మాసాలు పడుతుంది. జూన్‌లో రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడి, చేపలు మళ్లీ పైకి వస్తాయి. అందుకే ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు తూర్పు తీరంలో చేపల వేట నిషేధం అమలవుతుంది. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో కూడా వేట నిషేధానికి మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

- 14 అర్ధరాత్రి నుంచి వేట నిషేధం
- మత్స్య సంపద పెంపునకు అమలు
- జూన్ 15 అర్ధరాత్రి నుంచి వేట మొదలు
- ప్రభుత్వం నుంచి రూ.10 వేలు భృతి
- జిల్లాలో 12 వేల మత్స్య కుటుంబాలకు లబ్ధి

అచ్యుతాపురం(అనకాపల్లి) : గంగపుత్రులు వేటకు విరామం చెప్పే సమయం వచ్చింది. నిత్యం సముద్రంలో వేట సాగించే వీరు రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోనున్నారు. మత్స్యసంపద ప్రత్యుత్పత్తికి అనుకూల సమయం కావడంతో ఈ రెండు మాసాలు మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట నిషేధం తప్పనిసరి. సముద్రంలో మత్స్య సంపద పెరిగేందుకు దశాబ్దాల నుంచి ఈ విరామం అమలులో ఉంది.

14 అర్ధరాత్రి నుంచి అమలు...

ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేటను మత్స్యకారులు నిలిపివేస్తారు. ముఖ్యంగా మెకనైజ్డ్(మర) బోట్లను ఒడ్డునే లంగరు వేస్తారు. ఈ రెండు నెలల కాలంలో చేపలు సముద్రం లోపల గుడ్లను పెడతాయి. ఈ సమయంలో వేట చేస్తే చేపల సంతానోత్పత్తి ఆగిపోతుంది. తద్వారా వారికే నష్టం కలగనుంది. ఈ కారణంగా జూన్ 15 వరకూ వేటకు వెళ్లకుండా మత్స్యకారులు ఇంటి వద్దే ఉండిపోతారు. ఈ సమయంలో బోట్లకు మరమ్మతులు, రంగులేయడం, వలల్ని బాగు చేసుకోవడం తదితర పనుల్లో వీరు బిజీగా ఉంటారు.

ఏటా 44 వేల టన్నుల మత్స్య సంపద

అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. ఈ తీరం పరిధిలోని ఆరు మండలాల్లో 31 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 12 వేల కుటుంబాలు పూర్తిగా చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లా నుంచి ఏటా 44 వేల టన్నుల మత్స్య సంపద దేశవిదేశాలకు ఎగుమతి అవుతోంది. మత్స్యవేటలో ఎన్ని ఇబ్బందులున్నా.. గంగ పుత్రులకు ఇదే జీవనాధారం. ఇటీవల కాలంలో చేపలకు డిమాండ్ పెరిగింది. రుచితో పాటు, ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యుల సూచనతో చేపలను ఆహారంగా తీసుకుంటున్నారని మత్స్యకారులు చెప్తున్నారు. చందువా, ట్యూనా వంటి చేపల్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. చెన్నై, కొచ్చిన్, ముంబయి వంటి ప్రాంతాలకూ.. జిల్లా నుంచి మత్స్య సంపద సరఫరా అవుతోంది.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కోసం 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. గత ఏడాది అనకాపల్లి జిల్లా పరిధిలో 10,244 మందికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందించారు. మెకనైజ్డ్ బోట్లకు ఆరుగురు చొప్పున, మామూలు బోట్లకు ముగ్గురు చొప్పున పరిగణలోకి తీసుకొని లబ్ధిదారుల్ని గుర్తిస్తారు. వీరికి మే నెలలో పరిహారం అందిస్తారు. నేరుగా మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తారు. జిల్లాలో 12 వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.



ఒడ్డున లంగరు వేసిన బోట్లు, (ఇన్‌సెట్) వలతో పట్టిన చేపల్ని మోస్తున్న మత్స్యకారులు

వేట నిలిపివేయాలి

ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు వేట నిలిపివేయాలి. జూన్ 15 అర్ధరాత్రి నుంచి వేటకు వెళ్లవచ్చు. నిషేధ సమయంలో పరిహారం అందిస్తాం. చేపల సంతానోత్పత్తి ప్రక్రియ మత్స్యకారుల జీవితాలకు కూడా కీలకం. మత్స్య సంపద పెరిగేందుకు ఈ రెండు మాసాల విరామం ప్రధానమైనది.

– లక్ష్మణరావు, జేడీ, మత్స్య శాఖ

కళ్లమంటలు... ఉక్కిరిబిక్కిరి

- లారీ నుంచి రసాయనాల లీక్‌తో ఆందోళన
- అందిన సమాచారంతో అధికారులు అప్రమత్తం

సాక్షి, అనకాపల్లి: జేఎస్ ఫార్మాసిటీలో మైలాన్ పరిశ్రమకు తరలిస్తున్న ప్రమాదకరమైన రసాయన పదార్థం(థియో ఫినాల్) లీక్ అవ్వడంతో సమీప ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. పరవాడ మండలం లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో గడువు తీరిన థియో ఫినాల్ విష వాయువు వ్యాన్‌లోని డ్రమ్ముల నుంచి లీక్ అయ్యింది. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఒక్కసారిగా కళ్ల మంటలు రావడంతో లంకెలపాలెం పరిసర ప్రజలు, ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. వ్యాన్‌లో లీకైన డ్రమ్ములను అధికారులు గుర్తించి, ఆ రసాయనాన్ని వేరే డ్రమ్ముల్లోకి మార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారణమైన వారిపై అధికారులు చర్యలు చేపట్టారు. అయితే విషవాయువు ఎక్కడనుంచి వస్తుందో తెలుసుకునేందుకు సుమారు 2 గంటల సమయం పట్టింది. సంస్థ నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు ఇబ్బంది పడ్డారు.

అక్రమ లేఅవుట్లపై దృష్టి

- నర్సీపట్నం మున్సిపాలిటీలో 87 గుర్తింపు



అక్రమ లేఅవుట్ల విస్తీర్ణం కొలతలు తీస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

నర్సీపట్నం: అక్రమ లేఅవుట్లపై నర్సీపట్నం మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఎక్కడెక్కడ అనుమతి లేని లేఅవుట్లు ఉన్నాయో గుర్తిస్తున్నారు. క్రమబద్ధీకరణ చేసుకోనివారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటి వరకు 87 అక్రమ లేఅవుట్లను గుర్తించారు. కొన్ని లేఅవుట్లలో పాతిన రాళ్లను అధికారుల గతంలో తొలగించారు. క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం పలుమార్లు అవకాశం కల్పించినా వినియోగించుకునేందుకు చాలామంది ముందుకు రాలేదు. మున్సిపాలిటీలోని బలిఘట్టం, షణ్ముఖనగర్, కొత్త లక్ష్మి రోడ్డు, చింతపల్లి రోడ్డు, శివపురం తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో లేఅవుట్లు వెలిశాయి. లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారి వివరాలను సేకరించి, వారికి అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లేఅవుట్లను క్రమబద్ధీకరించుకుంటే కొనుగోలు చేసిన స్థలాలకు చట్టబద్ధత కలగడంతో పాటు మౌలికవసతులు సమకూరుతాయి. పురపాలక సంఘానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోవాలనే ఉద్దేశంతో అప్పోసాప్పో చేసి పలువురు స్థలాలు కొన్నారు. అలా కొనుగోలు చేసిన వారంతా స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. రెగ్యులరైజ్ చేయని స్థలాలకు 14 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే క్రమబద్ధీకరించుకుంటే 7 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది, ఇలా పలు ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ లేఅవుట్లను గుర్తిస్తున్నారు. లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– కె.కనకారావు, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తెలిపారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ సచివాలయం-3 పరిధిలో మధురానగర్, విద్యుత్‌నగర్, వాటర్‌వర్క్స్ ప్రాంతాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాయమాటలతో అధికారం చేజిక్కించుకోవాలని కుట్రలు పన్నుతున్న పగటివేషగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి, అందులో పొందుపరిచిన వాటిని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో గాంధీనగరం, తుమ్మపాల పరిధిలోని మధురానగర్, విద్యుత్‌నగర్‌కు మధ్యలో సీసీ రహదారి ఉండడంతో జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని తీసుకెళ్లమని చెబుతున్నారని, మీది పంచాయతీ పరిధి, తాము జీవీఎంసీ సిబ్బందిమంటూ సమాధానమిస్తున్నారని స్థానికులు మంత్రి అమర్‌నాథ్, ఎంపీ వెంకట సత్యవతి దృష్టికి తీసుకొచ్చారు. సుమారు పదిహేనురోజులుగా ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోయిందని, నూతన డ్రైనేజీ నిర్మించాలంటూ వారు కోరారు. ఈ సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. మధురానగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయం-3 భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మరో రెండునెలల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అనంతరం జీవీఎంసీ పరిధిలో ఉన్న గాంధీనగరం సోషల్‌వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్లను మంత్రి, ఎంపీ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ కో ఆప్షన్‌సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

నైపుణ్య శిక్షణ.. ఉపాధి రక్షణ

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన
- కొత్తగా మరో రెండు కోర్సులు

నర్సీపట్నం: చేతిలో డిగ్రీ పట్టా ఉన్నప్పటికీ ఎంతో మంది నిరుద్యోగులకు సరైన ఉద్యోగాలు లభించడం లేదు. మరికొంతమంది అభ్యర్థుల్లో సరైన స్కిల్స్ ఉండటం లేదు. దాంతో కార్పొరేట్ కొలువులకు ఎంపిక కావడం లేదు. ఈ నేపథ్యంలో వీరికి మెరుగైన నైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం స్కిల్‌హబ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదట్లో రెండు కోర్సులతో స్కిల్‌హబ్ ప్రారంభమైంది. వృత్తి నైపుణ్య శిక్షణ పొందేందుకు నిరుద్యోగ యువత ఆసక్తి చూపుతుండడంతో మరో రెండు కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెల నుంచి కొత్త కోర్సుల బ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో ఉన్న అవకాశాలకు అనుగుణంగా నాలుగు కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

శిక్షణతోపాటు ఉపాధి...

నిరుద్యోగుల కోసం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లాలో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అనకాపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. నర్సీపట్నం స్కిల్‌హబ్ సెంటర్‌లో ప్రస్తుతం ప్రొటక్షన్ కెమిస్ట్రీ, జనరల్ డ్యూటీ నర్సింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల నుంచి కొత్తగా డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండన్స్ అసిస్టెంట్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ప్యాకేజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలి బ్యాచ్‌లో 30 మంది చొప్పున రెండు కోర్సుల్లో 60 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలపరిమితి మూడు నెలలగా నిర్ణయించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రాలతోపాటు ఆయా సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. కొత్త కోర్సుల్లో చేరే నిరుద్యోగ యువత బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చదివి ఉండాలి.



శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు

శిక్షణ తర్వాత ఉద్యోగాలు



కొత్త కోర్సులకు సంబంధించి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. నవంబర్‌లో స్కిల్‌హబ్‌ను అందుబాటులోకి తెచ్చాం. 30 మందికి శిక్షణ ఇచ్చి 22 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాం. డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండన్ట్ అసిస్టెంట్‌కు బీఎస్సీ, బీఏ కంప్యూటర్స్ చదివి ఉండాలి. మ్యాన్ ఫ్యాక్చరింగ్, ప్యాకేజీ కోర్సులో యువకులకు మాత్రమే శిక్షణ ఇస్తాం. ఈ కోర్సులో శిక్షణ పొందేందుకు విధిగా బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చదివి ఉండాలి. శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వై.శ్రీనివాస్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి, నర్సీపట్నం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు

- ఉమ్మడి జిల్లా 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

అనకాపల్లి రూరల్: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమకు పోస్టింగ్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేలును తాము బతికున్నంతవరకూ మరిచిపోలేమని ఉమ్మడి విశాఖ 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఉమ్మడి విశాఖలో 1998 డీఎస్సీ ద్వారా అర్హత సాధించిన అభ్యర్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు ఈ సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తమకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. ఇందుకు సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.తమ సమస్యను గుర్తించడమే కాకుండా పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తమకు పోస్టింగ్ ఇవ్వడానికి నిర్ణయిస్తూ జీవో జారీ చేయడంపై పలువురు అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ టీచర్ కావాలన్న తమ చిరకాల కోరిక సీఎం జగన్ వల్లే నెరవేరిందని చెప్పారు.సీఎం ఆకాంక్షల మేరకు కష్టపడి పనిచేస్తామన్నారు.ఈ సందర్భంగా పలువురు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డి.అప్పారావు, పి.అప్పలరాజు,పి.శ్రీనివాసరావు, ఆర్.సీతయ్య దొర,కె.రమణ, ఎస్.సత్తిబాబు,డి అప్పలనాయుడు,వివిధ మండలాల నుంచి వచ్చిన క్వాలిఫైడ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు


పందెంలో ఉరకలేస్తున్న ఎడ్లు

కె.కోటపాడు: జిల్లా స్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా సాగాయి. మండలంలోని చౌడువాడ గ్రామంలో బంటు వారి కళ్లాల వద్ద మల్లెలమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా నర్సయ్యపేట రూ.11 వేలు, వల్లంపూడి ఎడ్లబండి రూ.8 వేలు దక్కించుకున్నాయి. తర్వాత మరో నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్ల యజమానులకు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మొక్కులను చెల్లించుకున్నారు.

అమ్మకు నీరాజనం

● నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు


రహదారిపై క్యూలైన్‌లో భక్తులు


అమ్మవారి ముఖద్వారం వద్ద భక్తులు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో భాగంగా మూడో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా, విజయనగరం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూఉన్న చలువ పందిళ్లలో కుటుంబ సమేతంగా వంటకాలు తయారు చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, భోజనాలు చేశారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రి అమ్మవారిపాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లన్నీ తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉన్నాయి.ప్రత్యేక దర్శనం, ప్రముఖల క్యూలైన్లు కూడా రద్దీగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు, బాలింతలు పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటు చేశారు. శ్రీ హరిసేన సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు తాగునీరు, మజ్జిగ అందజేశాయి. డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనులు ట్రాఫిక్ సమస్యలేకుండా చర్యలు తీసుకున్నారు. ఆయలం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా శోభాయాత్ర


కోలాటమాడుతున్న మహిళా భక్తులు


యాత్రలో మాట్లాడుతున్న జనార్దజీ

అనకాపల్లిటౌన్: హిందువులంతా ఐక్యంగా ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహప్రచారక్ జనార్దజీ అన్నారు. అయోధ్యలో శ్రీరామమందరం నిర్మాణాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్ర ఆదివారం అనకాపల్లి పట్టణంలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో హిందూదేవాలయాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన్ మంత్రి మధు ఖర్జీ, యాత్ర కన్వీనర్ చదరం బాబూరావు, సభ్యులు కొణతాల జనార్దన్, కరణం నూకరాజు, పి.అప్పారావు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, పరిషత్ రాష్ట్ర సభ్యులు శ్రీకాళహస్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి వెంకట సత్యనారాయణ, కర్రి రామకృష్ణ పాల్గొన్నారు. హనుమాన్ శోభాయాత్రతో పట్టణమంతా సందడి వాతావరణం కనిపించింది. జై హనుమాన్... జై శ్రీరామ్... జై హనుమాన్.. నామస్మరణతో పట్టణం మార్మోగింది.

అనకాపల్లి- విశాఖ రహదారిలో నిర్వహించిన ర్యాలీలో 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్రతో రహదారులు కిక్కిరిసిపోయాయి. హనుమాన్ ఉత్సవ విగ్రహ రథం ఊరేగింపు ముందు ఆంజనేయస్వామి వేషధారణ, భజన, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి.

జపాన్‌కు టీటీ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్ : పదిరోజుల పాటు జపాన్ ఆటగాళ్ల టెక్నిక్, మెళకువల్ని నేర్చుకునేందుకు నలుగురి టేబుల్‌టెన్నిస్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కాజోల్ సునర్, ఫాల్గుణ్‌చార్వి, బాలుర విభాగంలో సూర్యతేజ, వెంకటకార్తికేయలను శిక్షణకు పంపనున్నారు. వీరంతా ఇటీవల స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన అంతరజిల్లాల టీటీ పోటీల్లో సత్తాచాటారు. రోటరీ విశాఖ వ్యాలీ,ఎల్ ఏంజిల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ సంఘం, జపాన్ సంయుక్త ఆధ్వర్యంలో వీరంతా ఈనెల 20వ తేదీన బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ విశాఖ వ్యాలీ రోటేరియన్లు జానకీరామ్, పాండురంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

మన్యంలో కొనసాగుతున్న వర్షాలు


పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న భారీ వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజూ వర్షాలు కురుస్తున్నాయి.మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటున్నప్పటికీ ఒక్కసారిగా వాతావరణ చల్లబడి వర్షం కురుస్తోంది. ఆదివారం సాయంత్రం పాడేరుతో పాటు సమీప ప్రాంతాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది.జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.రోజు కురుస్తున్న వర్షాలు రబీలో వరి,కూరగాయల పంటలకు మేలు చేస్తుండగా,వేసవి దుక్కులకు అనుకూలమని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు.

హాస్టల్ వార్డెన్ నిర్వాకంపై ఆందోళన


వార్డెన్‌పై ఆరోపణలు చేసిన తల్లిదండ్రులు


వార్డెన్‌ను నిలదీస్తున్న తల్లిదండ్రులు

● విద్యార్థినుల తల్లిదండ్రుల నిలదీత

చోడవరం రూరల్: మండలంలోని గోవాడలో వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో కలసి ఆదివారం ఆందోళన చేపట్టారు. వసతి గృహ నిర్వాహకురాలు తమకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, పాచిపోయిన అన్నాన్ని వడ్డిస్తుందని, ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. వంట గదికి వెళ్తే తన చేతిపై వేడిపప్పు వేశారని, మానిన గాయాన్ని ఒక విద్యార్థిని చూపింది. రాత్రి వేళల్లో బయట నుంచి మగపిల్లలు హాస్టల్‌లోకి ప్రవేశిస్తున్నారని, వార్డెన్‌కు చెబితే తమను ఎగతాళి చేస్తున్నారని వాపోయారు.

తమ తల్లిదండ్రులకు ఈ విషయాలు చెబితే తమపైనే నిందలు వేయడమే గాకుండా మరుసటి రోజు నుంచి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చిన వార్డెన్ పలకా పార్వతిని విద్యార్థినుల తల్లిదండ్రులు పి.అప్పన్న, ఎం.వరలక్ష్మి, పి.లక్ష్మి తదితరులు నిలదీశారు. గోడకుర్చీ వేయించడం, మోకాళ్లపై నడిపించడం, కొట్టడం, దుర్భాషలాడడం వంటి కఠిన శిక్షలు ఎలా వేస్తారని ఆగ్రహించారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని వార్డెన్ బదులిచ్చారు. అయినప్పటికీ ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జాలంపల్లిలో రెండు పూరిళ్లు దగ్ధం

● రూ.2 లక్షల ఆస్తి నష్టం


బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

మాడుగుల: మండలంలో జాలంపల్లి ఎస్సీ కాలనీలో శనివారం అర్థరాత్రి ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. సుమారు 2 లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన బుంగా పార్వతి, డోంకా దేముడమ్మ, పూరిల్లు పూర్తిగా కాలిపోయాయి. ఇరువురు బాధితులు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇంట్లో నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ జి. దారమల్లేశ్వరి, చిన్ని సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు బాధితులకు 25 కిలోలు చొప్పున బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులతో పాటు సర్పంచ్ దారమల్లేశ్వరి చిన్ని సొంత నగదును బాధితులకు ఆదివారం అందజేశారు. ఆర్ఐ నాగేశ్వరావు, వీఆర్వో సంఘటన స్థలాన్ని సందర్శించి ఆస్తి నష్టం వివరాలు సేకరించారు.

గండిపోశమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

దేవీపట్నం : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి. సుజాత గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబసభ్యులతో కలసి అమ్మవారి ఆలయానికి ఆమె చేరుకున్నారు. దేవాదాయశాఖ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ భాంజ్ డియో, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.



గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి సుజాత

భీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పాడేరు: హుకుంపేట మండలం ఉక్కుర్బలోని భీమలింగేశ్వరస్వామివారిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు దర్శించుకున్నారు. గిరిజనులంతా తమ సంప్రదాయ ప్రకారం వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శివలింగానికి వారు ప్రత్యే క పూజలు చేశారు.బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివలింగాల ప్రదర్శనను వారు సందర్శించారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు.

వీధి బాలల భవితకు భరోసా!

● అనాథలకు అండగా హాస్టళ్లు
● భీమిలి, చినగదిలిలో వసతి కేంద్రాలు
● ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక సిబ్బంది


ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఏ దిక్కూలేని వారికి ప్రభుత్వమే పెద్ద దిక్కుగా మారింది. నా అనేవారు లేక దీనావస్థలో ఉన్న వీధి బాలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసాగా నిలుస్తోంది. అనాథలు, తల్లిదండ్రులు లేని చిన్నారులు, వీధి బాలలు, హెచ్ఐవీ పీడిత బాల బాలికలు, సెక్స్ వర్కర్ల పిల్లలకు అండగా 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవసియ హాస్టళ్లు' పేరిట ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం, చినగదిలిలో సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలకు వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ పిల్లలకు సకల సౌకర్యాలు కల్పించి.. రుచికరమైన పౌష్టికాహారం అందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది.

'అందరికీ విద్య' నినాదంతో..

వెనుక వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమనే ఆశయంతో విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేస్తోంది. 14ఏళ్ల లోపు పిల్లలంతా పనుల్లో కాకుండా బడిలోనే ఉండేలా క్షేత్రస్థాయిలో పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. కొన్ని ప్రత్యేక పరిస్థితులు కారణంగా చదువులకు దూరమవుతున్న అనాథలకు సైతం అండగా నిలిచి, చదువులు దరిచేర్చాలనే గొప్ప సంకల్పంతో వసతి గృహాలను నిర్వహిస్తోంది.

కేంద్రాల్లో సకల సౌకర్యాలు

భీమునిపట్నంలో 147 మందికి ఆసరా కల్పిస్తూ వసతి గృహం ఏర్పాటు చేశారు. వీరికి ఇదే చోట పాఠశాలను సైతం నిర్వహిస్తున్నారు. ఇక్కడ 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనందిస్తున్నారు. చినగదిలిలో 70 మందికి హాస్టల్ ఏర్పాటు చేశారు. వీరంతా చుట్టుపక్కల గల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వస్తూ.. ఇక్కడ వసతి పొందుతున్నారు. వసతి గృహంలో రుచికరమైన పౌష్టికాహారంతో పాటు సకల సౌకర్యాలు కల్పించారు. వసతి గృహాల్లోనే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ.. ఇతరులతో పోటీ పడేలా ఇక్కడి సిబ్బంది తర్ఫీదు ఇస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి వారికి మరింత మెరుగైన సేవలందించేలా పర్యవేక్షిస్తున్నారు. చదువులతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసేలా వైద్య సిబ్బందిని కూడా నియమించారు.

వేసవిలోనూ కొనసాగిస్తాం



ప్రత్యేక పరిస్థితులు కారణంగా చదువులకు దూరమవుతున్న పిల్లల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో వసతి గృహాలను నిర్వహిస్తున్నాం. వీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇక్కడ పనిచేసే సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇటీవలే మంజూరయ్యాయి. పిల్లలు కోరిక మేరకు వేసవిలో ఈ కేంద్రాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–వానపల్లి శైలజ, ప్రత్యామ్నాయ పాఠశాలల కో–ఆర్డినేటర్, విశాఖ జిల్లా

సద్వినియోగమయ్యేలా శ్రద్ధ చూపాలి



ప్రభుత్వం గొప్ప సంకల్పంతో వసతి గృహాలను నిర్వహిస్తోంది. అనాథలు, తల్లిదండ్రులు లేని పిల్లలు, హెచ్ఐవీ పీడితులు, వీధి బాలల అభివృద్ధి కోసమని ఏర్పాటు చేసిన వసతి గృహాల ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి. వీటిని నిరంతరం పర్యవేక్షించాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే కమిషన్ కూడా జోక్యం చేసుకుంటుంది.

–డాక్టర్ జి.సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

అన్నదాతా సుఖీభవ



కేజీహెచ్ సుభోజనం కౌంటర్‌లో రోగుల సహాయకులకు భోజనం సరఫరా

ఎవరూ ఆకలితో ఉండరాదన్న ఆశయంతో విశాఖకు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో సుభోజనం పేరిట రోగులు, వారి సహాయకులకు చక్కటి భోజనం అందిస్తున్నారు. వైద్యసేవల పరంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నిత్య సేవ చేస్తున్నారు. దాతల చేయూత లేని రోజుల్లో రూ. 30 వసూలు చేస్తున్నారు. కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్ 11 వసంతాలు పూర్తి చేసుకుంది.


2011 నవంబర్ 21న సుభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ గిరిజా శంకర్

● 11 ఏళ్లుగా కేజీహెచ్ రోగుల సహాయకులకు 'సుభోజనం'
● హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిత్యసేవ

మహారాణిపేట : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆశ్రమాలకు 10 కిలోమీటర్ల పరిధిలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదన్న సదాశయంతో 2011 నవంబర్ 21న నాటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ గిరిజా శంకర్ కేజీహెచ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవస్థాపక గురువు శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేజీహెచ్‌లో ఈ కౌంటర్ ప్రారంభించక ముందు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి రోగుల సహాయకులకు ఎంత తక్కువలో చూసుకున్నా ప్రతి రోజూ రూ.150 వరకు ఖర్చు అయ్యేది. ఈ పరిస్థితిని గమనించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆస్పత్రి ఆవరణలో ఈ సదుపాయం ప్రారంభించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనం అందిస్తోంది. సంవత్సరంలో 365 రోజులు ఈ సదుపాయాన్ని కొనసాగిస్తోంది.

మేము సైతం అంటున్న పూర్వ విద్యార్థులు

ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న కేజీహెచ్ పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ రవి, శేష శర్మ ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది వేడుకల సందర్భంగా ప్రతి రోజూ ఉచితంగా 400 మందికి ఒక్క సంవత్సరం భోజన వితరణ చేయాలని నిర్ణయించుకున్నారు. తమ తల్లితండ్రులు వడ్లమాని అన్నపూర్ణేశ్వరరావు, పద్మావతి గౌరవార్థం ఏడాది పాటు రోజుకు 400 మందికి భోజనాలకు అయ్యే ఖర్చును భరించారు.

మెనూ ఇలా..

సుభోజనం ద్వారా ఉదయం ఇడ్లీ, ఉప్మా, మధ్యాహ్నం అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, రాత్రి కూడా మధ్యాహ్నం లాగే అందజేస్తున్నారు. ప్రతి రోజూ 1000 నుంచి 1200 మందికి భోజనం పెడుతున్నారు. దాతల సహకారంతో నెలలో 20 నుంచి 25 రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుండగా.. మిగిలిన రోజుల్లో హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్ వారే నిర్వహిస్తున్నారు. ఇందులో పలువురు కేజీహెచ్ వైద్యులు కూడా ఈ సేవలో భాగస్వాములయ్యారు.

సేవకు వయసుతో సంబంధం లేదు



సేవ చేయాలని ముందుకు వచ్చాను. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసి రిటైర్ అయ్యాను. హరేకృష్ణ మూవ్‌మెంట్ చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగం అయ్యాను. నాకు 70 ఏళ్లు. 11 ఏళ్లుగా కేజీహెచ్ సుభోజనం కౌంటర్ వద్దకు వచ్చిన వారికి భోజనాలు వడ్డిస్తున్నాను.

–పిల్లల షణ్ముఖరావు, స్వచ్ఛంద సేవకుడు

సహాయకుల ద్వారా ప్రచారం



ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న రోగి సహాయకుల నుంచి విస్తృత ప్రచారం లభిస్తోంది. పలువురు దాతలు ముందుకు వచ్చి ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. వారి ఇళ్లలో జరిగే పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల సమయంలో రోగి సహాయకులకు ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. ఇలా నెలలో సుమారు 20 రోజుల పాటు సేవలు కొనసాగుతున్నాయి. ఉచిత భోజన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు. మరిన్ని వివరాలకు యదు రాజదాస (9010611108), జీతమిత్ర దాస (8184887108)లను సంప్రదించాలి.

–డాక్టర్ నిష్కించిన భక్తదాస, అధ్యక్షుడు, హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్

భోజనం ఎంతో బాగుంది



నేను కొయ్యూరు మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గిరిజనుడిని. నా భార్యకు ఒంట్లో బాగులేక కొద్ది రోజుల క్రితం కేజీహెచ్‌లో చేర్పించాను. నా భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు తోడుగా ఉన్న నేను ప్రతి రోజూ ఇక్కడ భోజనం చేస్తున్నాను. ఈ భోజనం ఎంతో బాగుంది. శాకాహార భోజనం అందిస్తున్నారు. తృప్తిగా భోజనం చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. భోజన నిర్వాహకులకు ధన్యవాదాలు.

– వంతల పాండురాజు, నిమ్మలపాలెం, కొయ్యూరు మండలం, ఏఎస్ఆర్ జిల్లా

క్లుప్తంగా

నేడు కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని కొత్తూరు పంచాయతీ సచివాలయం–2 పరిధిలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తారని పేర్కొన్నారు. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

యాదవుల సంక్షేమానికి కృషి


కరక శేషు

కశింకోట : అసెంబ్లీ నియోజక వర్గంలోని యాదవులను ఒక త్రాటి పైకి తీసుకువచ్చి వారి సంక్షేమానికి కృషి చేస్తానని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు అన్నారు. మండలంలోని జమాదులపాలెం గ్రామానికి చెందిన శేషు సమితి అసెంబ్లీ అధ్యక్షునిగా ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పర్యటించి యాదవుల సమస్యలను తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

పేద విద్యార్థులకు సాయం

అనకాపల్లిటౌన్ : ప్రతీ వ్యక్తి సంపాదించిన దాంట్లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తొచిన సాయం చేయాలని మిత్ర కేసీజీఎఫ్ అనకాపల్లి వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ గుండా రమేష్‌గుప్తా అన్నారు. స్థానిక కుమ్మరి వీధి నందీశ్వర్ ఆలయ సమీపంలో నిరుపేద విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షుడు బండారు సతీష్, కార్యదర్శి వెంకటరమణ, సభ్యులు సతీష్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 540 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 15 మంది రక్తదానం చేశారు.ఉచిత కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 353 మందికి కంటి అద్దాలు అందజేశారు. 109 మందికి మందులు అందజేశారు. 32 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మీటర్	రాజా
రంగమార్తాండ	సత్యనారాయణస్క్రీన్-1
డూంజియన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణస్క్రీన్-2
రావణాసుర	షిర్డిసాయి
దసరా	పర్తిసాయి
భూతవైద్యుడు దిపోప్స్ ఎక్సార్సిస్ట్	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-16 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 224 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 156 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సర్వే రాళ్లతో భూ రక్ష


కశింకోటలో భూములకు సర్వే రాళ్లు వేస్తున్న సిబ్బంది


సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న జేసీ కల్పనా కుమారి(ఫైల్)

- మండలంలో చురుగ్గా సర్వే రాళ్ల ఏర్పాటు
- మే 5లోగా ఫ్లగ్‌లతో తాత్కాలిక హద్దులు
- జేసీ ఆదేశాలతో అధికారుల ఉరుకులు

కశింకోట : మండలంలో సమగ్ర రీ సర్వే పూర్తయిన భూములకు హద్దులు నిర్ణయిస్తూ సర్వే రాళ్ల పాతే కార్యక్రమం జోరందుకుంది. ప్రస్తుతం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో సర్వే రాళ్ల పాతుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే భూ వివాదాలకు పూర్తిగా చెక్ పడుతుందని అధికారులు చెప్తున్నారు.

రైతుల ఫిర్యాదుతో మరోసారి సర్వే

మండలంలో 27 రెవెన్యూ గ్రామాలున్నాయి. వాటిలో 22 గ్రామాల్లో సమగ్ర భూముల రీ-సర్వే నిర్వహించారు. మరో 5 గ్రామాల్లో సర్వే జరగాల్సి ఉంది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొన్ని చోట్ల సర్వే సక్రమంగా జరగలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రెవెన్యూ యంత్రాంగం అవసరమైన చోట్ల రీసర్వే నిర్వహిస్తోంది. వివాదాలుంటే ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించి, సవ్యంగా ఉన్న వాటిని రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు అధికారులంటున్నారు. అయితే ఇప్పటి వరకు నిర్వహించిన రీ-సర్వేలో వివాదం లేని భూములకు మాత్రం గూగుల్ మ్యాప్ ఆధారంగా హద్దులు నిర్ణయించారు. వీటి మేరకు వైఎస్సార్ భూ రక్షా పథకం కింద సర్వే రాళ్లు వేసే కార్యక్రమాన్ని రెండు వారాల కిందట చేపట్టారు.

ఉపాధి కూలీలతో చురుగ్గా పనులు

ప్రాథమికంగా కశింకోట, వెదురుపర్తి, గొబ్బూరు, తాళ్లపాలెం వద్ద గైతులపాలెం రెవెన్యూ గ్రామాల్లో పట్టా భూములు, ప్రభుత్వ భూముల్లో సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హద్దు రాళ్లను గొయ్యి తీసి భూమిలో నిలిపేందుకు ఉపాధి కూలీలను వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు ఈ పనులను నిర్వహిస్తున్నారు. మండలానికి సుమారు 50 వేల సర్వే రాళ్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు. వీటిలో మొదటి విడతగా 14,116 సర్వే రాళ్లు సరఫరా చేశారు. వీటిలో దాదాపు 3,700 వరకు ఆయా గ్రామాల్లో వేసినట్లు అధికారిక సమాచారం. ఇంకా మిగిలిన భూములకు సర్వే రాళ్లు అమర్చే పని నిర్వహిస్తున్నారు.

మే 5లోగా ఫ్లగ్‌ల ఏర్పాటు

కశింకోట, గైతులపాలెంలలో సర్వే రాళ్లు వేస్తున్న తీరును ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పరిశీలించారు. సర్వే రాళ్లు వచ్చేలోగా వివాదం లేని భూములకు గూగుల్ మ్యాప్ ఆధారంగా హద్దులు నిర్ణయించి, ఫ్లగ్‌లను కర్రలతో అమర్చాలని అధికారులకు ఆమె సూచించారు. రాళ్లు వచ్చాక ఫ్లగ్‌ల స్థానంలో అమర్చాలన్నారు. ఫ్లగ్‌లు అమర్చే పనిని మే 5లోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కొక్క సర్వే రాయి వేయడానికి రూ.వెయ్యి ఖర్చవుతోంది. దీన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఒక రాయి సుమారు రూ.800. దాన్ని భూమిలో అమర్చడానికి ఉపాధి కూలీ ఖర్చు సుమారు రూ.200. మండలంలో సర్వే రాళ్ల అమరిక పూర్తయితే భూ సరిహద్దు వివాదాలు పూర్తిగా సమసిపోగలవని అధికారులు పేర్కొంటున్నారు.

వివాదాలకు చెక్

వైఎస్సార్ భూ రక్షలో వివాదం లేని ప్రభుత్వ, పంట భూములకు సర్వే రాళ్లు వేస్తున్నాం. కశింకోట, వెదురుపర్తి, గొబ్బూరు, గైతులపాలెం గ్రామాల్లో కార్యక్రమం జరుగుతోంది. జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశాల మేరకు గూగుల్ మ్యాప్ ఆధారంగా భూములకు హద్దులు నిర్ణయిస్తున్నాం. మే 5లోగా ఫ్లగ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఈ కార్యక్రమం పూర్తయితే భూ వివాదాలు పూర్తిగా సమసిపోతాయి.

–కె. సురేష్‌నాయుడు, తహసీల్దార్, కశింకోట

‘క్రీడలకు వయసుతో సంబంధం లేదు’


టెన్నిస్ విజేత అప్పలస్వామినాయుడుని సత్కరిస్తున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : వయస్సుతో సంబంధం లేకుండా నిత్యం ఆటలు ఆడడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ అన్నారు. ఇటీవల భీమవరంలో జరిగిన టెన్నిస్ టోర్నమెంట్ విజేత విశ్రాంత ప్రిన్సిపాల్ విల్లూరి అప్పలస్వామి నాయుడుని స్థానిక జార్జ్‌క్లబ్ ఆవరణలో ఆదివారం సత్కరించి మాట్లాడారు. 75 ఏళ్ల వయసులో కూడా క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్న నాయుడు నేటి యువతరానికి ఆదర్శమని పేర్కొన్నారు. నిత్యం క్రీడలు ఆడేవారిలో రక్తప్రసరణ బాగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టెన్నిస్ క్రీడాకారులు డాక్టర్ చంద్రమౌళి, జాజుల రమేష్, నర్సింగరావు, ఆడారి దేవకి, మద్దాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండిమాంబ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామపెద్దలు

సబ్బవరం: మండలంలోని పెదయాతపాలెం గ్రామంలో కొలువుదీరిన బండిమాంబ అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని గ్రామ పెద్దలు శరగడం రాము, బొడ్డేటి మహలక్ష్మినాయుడు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆయుర్వేదంతో రోగాలకు చెక్


యోగా శిక్షణలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్

అనకాపల్లిటౌన్ : ఆయుర్వేదంతో అత్యంత క్లిష్టమైన వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని రాష్ట్ర ఆయుర్వేద పరిశోధనా సంస్థ డైరెక్టర్, వైద్యుడు పెరుమళ్ల సుందర్‌రాజ్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం విశ్వ ఆయుర్వేద పరిషత్, భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడారు. నొప్పులు కలిగించే అత్యంత క్లిష్టమైన వ్యాధుల నివారణ విధానాలను వివరించారు. లంబార్ స్పాండిలోసిస్, సెర్వికల్ స్పాండిలైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి నొప్పుల లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అస్తవ్యస్తమైన జీవనశైలి, విపరీతమైన మానసిక ఒత్తిడి వలనే శరీరంలో మార్పులు జరిగి నొప్పులు మొదలవుతాయన్నారు. పరిశుభ్రమైన ఆహారం, సమయానికి భోజనం, నిద్ర, సూర్యోదయం కన్నా ముందు మేల్కొని శారీరక శ్రమ చెయ్యడం, మనసును ప్రశాంతంగా ఉంచడం ద్వారా నొప్పులు కలిగించే ఎన్నో వ్యాధులను నిర్మూలించవచ్చని సూచించారు. ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధనా సంస్థలో ఈ నెల 15 నుంచి 21 వరకు ఉచిత ఆయుర్వేద యోగ శిక్షణా సప్తాహం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 29 నుంచి మే 1వ తేదీ వరకూ జీవన విద్య వర్క్‌షాప్‌లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు వీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల నరసింగరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభా యాత్రకు పయనం


శ్రీహనుమాన్ శోభాయాత్రకు బయలుదేరిన భక్తులు

పాయకరావుపేట : అనకాపల్లిలో జరిగే శ్రీ హనుమాన్ శోభాయాత్రకు పట్టణం నుంచి పలువురు హనుమాన్ భక్తులు బయలుదేరి వెళ్లారు. ఆదివారం అనకాపల్లిలో గల శ్రీ సూర్యానారాయణ మందిరం వద్ద జరుగుతున్న హనుమాన్ శోభా యాత్రలో పాల్గొనడానికి హనుమాన్ భక్తులు మోటారు బైక్ లపై బయలుదేరారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. వికాస తరంగిణి ప్రతినిధి చిక్కాల శ్రీనుతో పాటు పలువురు శోభాయాత్రకు తరలివెళ్లారు.

వ్యాయామంతో ఎముకలు దృఢం


వైద్యుడు వసంతకుమార్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : నిత్యం వ్యాయామంతో శరీరంలో ఎముకలు దృఢంగా ఉంటాయని ఎముకల వైద్యుడు ఆళ్ల వసంతకుమార్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎముకల వ్యాధిలపై ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ తగ్గడం తదితర కారణాలతో ఎముకలు దృఢత్వాన్ని కోల్పోతాయన్నారు. పరిశుభ్రమైన పాలు, పెరుగు, రాగిమాల్ట్ తీసుకోవడం ద్వారా శరీరంలో కాల్షియం స్థాయి పెరుగుతుందన్నారు. ఎముకలు దృఢంగా ఉంటే పెరాలసిస్ వ్యాధికి దూరంగా ఉన్నట్టేనని పేర్కొన్నారు. ఉదయం ఎండలో నడక లేదా వ్యాయమం కూడా ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. 45 ఏళ్లు పైబడిన మహిళలు ఈస్ట్రోజన్ స్థాయిల నిర్వహణకు కోసం నిత్యం వ్యాయమం చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ వసంతకుమార్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యల్లపు సాంబశివ, కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, సీనియర్ సభ్యుడు, వైద్యుడు డీడీ నాయుడు, మద్దాల కూర్మారావు, నల్ల దేముళ్లు, కె.వి.గౌరీపతి, చవితిన నర్సింగరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ

మునగపాక : మునగపాక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం మధ్యాహ్నం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు హాజరవుతారన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివిధ పనులు, కేటాయింపులపై చర్చించనున్నట్టు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని రవికుమార్ కోరారు.

సాగర తీరంలో సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు కేరింతలు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు తిక్కవానిపాలెం తీరంలో ఉత్సాహంగా గడిపారు. ఇసుక తెన్నులపై సేద తీరుతూ అలలపై నుంచి వచ్చే పిల్ల గాలులను ఆస్వాదించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆట పాటలతో యువత సరదాగా గడిపారు. తీరంలో జలకాలాటలతో యువత కేరింతలు కొట్టారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


దుర్గమాంబ సన్నిధిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని బలిజపాలెంలో కొలువైన శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శనానికి బారులు తీరారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అమ్మవారిని దర్శించుకున్నవారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మామిడి కొండాజీ, సేనాపతి దుర్గఅప్పారావు, గొర్లె నూకరాజు, తాసుబిల్లి కనకరాజు, గొర్లె శ్రీను, ఆకుల శివ తదితరులు ఉన్నారు.

ఇంటింటా ‘మా నమ్మకం నువ్వే జగన్’


84వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాలపై వివరిస్తున్న పలకా రవి


83వ వార్డు ప్రజలకు జగనన్న స్టిక్కర్లను అందిస్తున్న రమేష్

అనకాపల్లిటౌన్ : స్థానిక కోట్నీవీధి 84వ వార్డు పరిధిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గత పాలకులకు, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను గమనించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోరుకొండ రాఘవ, శివ అప్పారావు, సూరిబాబు, శ్రీను, మల్లేష్, అప్పలసూర్యానారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

- స్థానిక లక్ష్మీదేవిపేట 83వ వార్డు పరిధిలో వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ద్వారా ప్రభుత్వానికి మద్దతిచ్చేలా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుద్ద పెంటారావు, భర్నికాన శ్రీను, పాము సన్నిబాబు, తామాడ రాజు, లక్కోజు రాంబాబు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట, తాళ్లపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కశింకోటలోని అగ్రహారం, గవరపేట, తాళ్లపాలెంలో సంత, బంగారయ్యపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారిళ్లకు అతికించారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ముద్రించిన బ్యాడ్జిలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమాల్లో తాళ్లపాలెం సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావు, చిన్ని జనార్దన్, గృహ సారథి గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలోని అగ్రహారంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో బ్రోచర్ల అందజేత


తాళ్లపాలెంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీ

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి


రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

అనకాపల్లి రూరల్ : సీపీఐ పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి, తొలితరం కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నేతలు ఆయన పోరాటాలు, సేవలను గుర్తుచేసుకున్నారు. వివిధ సమస్యలపై ఆయన చేపట్టిన ప్రజా ఉద్యమాలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు వివరించారు. ఆయన ఆశయాల సాధనకోసం పార్టీ నేతలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ధైర్యశాలిగా వక్తలు పేర్కొన్నారు. సీపీఐ నాయకులు వియ్యపు రాజు, కోరిబిల్లి శంకర్రావు, కొండూరి రవీంద్ర రమణ, నరాలశెట్టి సత్యనారాయణ, సామాజిక హక్కుల వేదిక నాయకుడు పప్పుల ఈశ్వర్రావు, దొక్కరి మోహన్, జీవి రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్


కశింకోటలోని గవరపేటలో ఈస్టర్ సందర్భంగా క్రైస్తవుల ప్రార్థనలు

కశింకోట : మండలంలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పురస్కరించుకుని క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. కశింకోటలోని ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో జీసస్‌ను కీర్తిస్తూ పాటలు పాడారు. క్రీస్తు బోధించిన సూక్తులను పాస్టర్ సన్నీ జేమ్స్ వివరించారు. సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, చర్చి కమిటీ అధ్యక్షుడు టి.మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

- గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించి ఏసుక్రీస్తు బోధనలు వినిపించారు.
- షాలెం మందిరం, సంతబయల, హౌసింగ్ కాలనీ, బయ్యవరం, వెదురుపర్తి, తేగాడ, కొత్తపల్లి, జమాదులపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జి.భీమవరం, అచ్చెర్ల, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, గొబ్బూరు, ఎఎస్‌పేట, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం, పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం


విద్యనేర్పిన గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : స్థానిక జీవీఎంసీ హైస్కూల్లో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 24 ఏళ్ల నాటి తీపి గురుతుల్ని నెమరువేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు దువ్వూరి శ్రీనివాసరావు, పీజే నాయుడు, కొణతాల సన్యాసిరావు, డీబీఎస్ శర్మ, మంత్రి నరసింగరావు, కాండ్రేగుల దుర్గాప్రసాద్, వై.సత్యంలకు పాదపూజ చేస్తూ, వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం తమ బ్యాచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షునిగా మదిన గోపాల్, ఉపాధ్యక్షునిగా వాకాడ రామసతీష్, కార్యదర్శిగా దొడ్డి హరి, సహాయ కార్యదర్శిగా ఉరికిటి శ్రీనివాసరావు, సలహాదారుగా నాగు, సభ్యులుగా గంటా సముద్రాలు, ఉంద్రు శంకర్, కరణం గణేష్, జోగా నాగేశ్వరరావు, అర్జున్, జి.సుధారాణి, కె.ఆదిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధికి తమ వంతు సాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత స్కూల్ ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ, సరస్వతీదేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు.